గలగల పారేలా..

- ఎన్నికల కోడ్ అనంతరం పనులు ప్రారంభించేలా చర్యలు
- అన్ని కాలువల్లోనూ తూటికాడ, పూడికతీత పనులు
- కృష్ణా జిల్లాలో 5.62 లక్షల ఎకరాల ఆయకట్టు
- గత ఏడాది వీటి కోసం రూ.28.17 కోట్లు వెచ్చించిన ప్రభుత్వం

సాగునీటి కాలువల నిర్వహణకు రూ. 53.63కోట్లు



బందరు కాలువ ప్రస్తుత పరిస్థితి

సాక్షి ప్రతినిధి, విజయవాడ: కృష్ణా డెల్టా పరిధిలో ఆయకట్టుకు నీరు ఇబ్బంది లేకుండా అందించేందుకు వీలుగా సాగునీటి పారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రధానంగా కాలువల్లో తూటికాడ, పూడికతీత, కాలువగేట్ల మరమ్మతులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో పాటు గట్లకు గండ్లుపడే అవకాశం ఉన్నచోట, లాకుల వద్ద గేట్లు, డ్రాప్‌లు దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతులు చేపడతారు. ఇందులో భాగంగా ఈ ఏడాది ఇప్పటికే అధికారులు బందరు, కేఈబీ, ఏలూరు, రైవస్ నాలుగు కాలువల పరిధిలో నిర్వహణ కోసం మొత్తం 238 పనులను రూ.53.63 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ పనులకు ఎస్ఈ ఆమోదం తెలిపి, సీఈ కార్యాలయానికి పంపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో దీనిపై ఇంకా చర్యలు తీసుకోలేదు. కోడ్ అనంతరం పనులకు ఆమోదం తెలిపి, టెండర్లు పిలిచేందుకు వీలుగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. డెల్టా కింద నీటి శిస్తు రెవెన్యూ శాఖ వసూలు చేయగా.. ఆ మొత్తం కలెక్టర్ ఖాతాకు చేరుతాయి. ఈ నిధులను ఆయకట్టు అభివృద్ధి శాఖ (సీఏడీ)కు పంపిస్తారు. నిధుల లభ్యత మేరకు పనుల ప్రాధాన్యతను బట్టి నిధులు కేటాయిస్తారు.

ఇది కృష్ణా డెల్టా పరిస్థితి..

ప్రకాశం బ్యారేజి కింద కృష్ణా డెల్టా పరిధిలో 13.08 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో కృష్ణా జిల్లాలో తూర్పు డెల్టా పరిధిలో 5.62లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో నామమాత్రంగా 1,757 ఎకరాల ఆయకట్టు మాత్రమే ఉంది. ఇందులో ఎక్కువ భాగం మెట్ట ప్రాంతం కాగా, మిగిలిన ఆయకట్టు నాగార్జునసాగర్ కుడికాలువ కింద ఉంది. ఈ ఆయకట్టుకు ఆలస్యంగా నీరు ఇస్తారు. గతేడాది కాలువల నిర్వహణ కోసం టెండర్లు పిలిచిన పనులు, ఈ నెలాఖరు లోపు పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గత ఏడాది జూన్‌లో పనులకు టెండర్లు పిలిచినా, ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని, జూన్ 6వ తేదీనే నీటిని విడుదల చేయడంతో, పనుల్లో జాప్యం జరిగింది. మిగిలిన పనులను ఇప్పుడు చేస్తున్నారు.

నిండుకున్న ప్రాజెక్టులు..

ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జలాశయాలు అన్ని అడుగంటాయి. శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు లేవు. కృష్ణా నది ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిస్తేగాని వరద నీరు ప్రాజెక్టులోకి చేరదు. నీటిపారుదల శాఖ అధికారులు ప్రాజెక్టులోకి నీరు చేరిన వెంటనే నీటిని విడుదల చేయడానికి సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల కోడ్ అనంతరం నీటి విడుదలపైనా స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది ముందస్తుగా నైరుతి పవనాలు వస్తాయని వాతావరణశాఖ నిపుణులు చెబుతున్నారు. దీనికి తోడు ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తొలకరి వర్షం రైతన్నలను పలకరించింది. కాలువలకు నీటిని త్వరగా విడుదల చేస్తే, పంటకోత సమయంలో తుపానుల బెడద నుంచి తప్పించుకోవచ్చు. రెండో పంటను ముందుగా సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చు.

ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం గత రెండేళ్ల ముందస్తుగా కాలువలకు నీటిని విడుదల చేస్తోంది. ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు వస్తాయన్న వాతావరణ శాఖ అధికారుల సూచనతో రైతన్నలు ఆశావహ దృక్పథంతో పంటలు సాగు చేసుకొనేందుకు సిద్ధమవుతున్నారు.

కాలువ పేరు	కృష్ణా జిల్లా (లక్షల ఎకరాల్లో)	ఎన్టీఆర్ జిల్లా (ఎకరాల్లో)
బందరు	1.51	–
కేఈబీ(కరువు)	1.38	–
ఏలూరు	0.56	1,332
రైవస్	2.17	425
మొత్తం	5.62	1,757

గత ఏడాది నిర్వహణ పనులు ఇలా..(2023-24)

డివిజన్	పనులు	నిధులు (రూ.లక్షల్లో)
కృష్ణా తూర్పు	37	752.85
కృష్ణా మధ్య	42	852.85
డ్రెయినేజీ	72	1200.00
స్పెషల్	01	11.40
మొత్తం	152	2,817.1

ఈ ఏడాది నిర్వహణ పనులు ఇలా..

మొత్తం పనులు: 238

అంచనా విలువ మొత్తం: రూ. 53.63కోట్లు

క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం



గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు మెరుగుమాల శివరామకృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక పాటిమీద గల కురుణాపీఠం వృద్ధాశ్రమంలో ఈ వైద్యపరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. క్లబ్ సభ్యులు మెరుగుమాల శోభనాద్రి-రమాదేవి సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కె.జోగేశ్వరరావు, క్లబ్ కార్యదర్శి కోనా రామారావు, కోశాధికారి కొమరవోలు రామకృష్ణ, సభ్యులు ఎల్ఈ వెంకటేశ్వరరావు, బి. కుటుంబరావు, బొగ్గారపు తిరుపతయ్య, ఎం.రామకృష్ణ, బ్రహ్మాజి, ఎస్. రంగారావు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థికి ఆర్థిక సాయం



తోట్లవల్లూరు: పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన పెనమకూరు జెడ్పీ పాఠశాల విద్యార్థి ఇంటూరి లీలా తన్మయ్‌కు పామర్రు మండలం కురుమద్దాలి గ్రామానికి చెందిన ఆముదాలపల్లి దుర్గాప్రసాద్ శుక్రవారం రూ.15 వేలు సాయం అందజేశారు. పదో తరగతి ఫలితాల్లో లీలా తన్మయ్ 574 మార్కులు సాధించటం అభినందనీయమని, భవిష్యత్‌లో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన పేర్కొన్నారు. నాయీ బ్రాహ్మణ సంఘం నాయకుడు జిడుగు అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తులను అలరించిన నరసింహ కోలలు



జుఝవరం(పామర్రు): గ్రామంలోని శ్రీయోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో గురువారం రాత్రి నిర్వహించిన నరసింహ కోలలు భక్తులకు అలరించాయి. తొలుత ఆలయంలో నరసింహ స్వామికి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. రాత్రికి ఆలయ ప్రాంగణంలో భక్తులచేత నరసింహ కోలలను నిర్వహించారు. స్వామివారి ఉత్సవిగ్రహాలకు రకరకాల పుష్పాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవిగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. తొలుత పూజా కార్యక్రమాలను రొంపిచర్లసాయి, రొంపిచర్ల ధన వెంకట సత్యనారాయణాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించామని ఆలయ ఈఓ దుర్గా ప్రసాద్ తెలిపారు.

నేడు, రేపు యల్లారమ్మ జాతర



నాగాయలంక: స్థానిక సబ్బినేనిబజారులో కొలువై ఉన్న సబ్బినేనివారి కులదేవత యల్లారమ్మ అమ్మవారి జాతర ఉత్సవం శని, ఆదివారాలు జరుగుతుందని శుక్రవారం ఆలయ మిటీ అధ్యక్షుడు సబ్బినేని భుజంగరావు తెలిపారు. శనివారం గ్రామస్తుల నేతృత్వంలో అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా నాగాయలంకలోని కృష్ణానదికి తీసుకువెళ్ళి శ్రీరామపాదక్షేత్రం ఘాట్‌లో పుణ్యస్నానాలు చేయించారు. తర్వాత గ్రామంలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలోని జల్దిలో ఉంచుతారు. అనంతరం రాత్రికి జల్ది నుంచి తరలించి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం ముగిసి ఘటాలు గుడికి చేరుకున్నాక ఆదివారం జాతర సంప్రదాయాల ప్రకారం సంబరం జరుపుతామని, భక్తులు చద్ది నైవేద్యాల సమర్పణతో మొక్కుబడులు తీర్చుకుంటారని అనంతరం అన్నసంతర్పణ నిర్వహిస్తామని చెప్పారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



మొవ్వలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

మొవ్వ: జూన్ ఒకటో తేది వరకు జరిగే ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొవ్వలోని క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, నిడుమోలు జెడ్పీ హైస్కూల్ ప్లస్ టులో పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. మొవ్వ పరీక్షా కేంద్రంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 12 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఇద్దరు హాజరయ్యారు. నిడుమోలు ప్లస్ టు హై స్కూల్లో ఐదుగురు విద్యార్థులు హాజరైనట్లు సీఎస్‌ఓలు కే మహేష్ బాబు తెలిపారు.

ప్రజాశీస్సులతో మరోసారి విజయం



అభిమానులతో ఎమ్మెల్యే అభ్యర్థి డీఎన్నార్

కైకలూరు: ప్రజాశీస్సులతో మరో పర్యాయం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. ఏలూరు రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో నాలుగు మండలాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, అభిమానులు శుక్రవారం డీఎన్నార్‌ను కలిసి ఇటీవల జరిగిన పోలింగ్ సరళిపై చర్చించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పార్టీలు చూడకుండా కేవలం అర్హతే ప్రాతిపదికన అందించిన పార్టీని అందరూ మరోసారి ఆశీర్వదిస్తారని నాయకులు డీఎన్నార్‌కు చెప్పారు. సంకు కోటేశ్వరరావు, జయమంగళ కాసులు, చిట్టూరి బుజ్జి, నీలపాల వెంకటేశ్వరరావు, కొయ్యె గంగయ్య, సింహాద్రి గురుమూర్తులు, ఎలిషారావు, మహాలక్ష్ముడు, రూబేను, ఇస్సాకు, రాజశేఖర్ పాల్గొన్నారు.

20 వాహనాల సీజ్

కలిదిండి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్‌ను కోరుకొల్లు శివారు బందబయలు కాలనీలో శుక్రవారం నిర్వహించారు. కైకలూరు రూరల్ సర్కిల్ సీఐ బి.కృష్ణకుమార్, కలిదిండి ఎస్సై ఎస్.ప్రియకుమార్ గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఎలాంటి పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఓట్ల లెక్కింపులో నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి శ్రీదేవి

పామర్రు: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు సంబంధించి వచ్చే నెల 4వ తేదీన జరిగే కౌంటింగ్‌లో అభ్యర్థులు, ఏజెంట్లు, ఎన్నికల సంఘ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పామర్రు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.శ్రీదేవి అన్నారు. స్థానిక కార్యాలయంలో రాజకీయ నేతలు, బూత్ ఏజెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడారు. పామర్రు నియోజకవర్గంలో మొత్తం 1,84,632 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,62,683 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. ఏజెంట్లుగా ఉండే వారిపై గతంలో ఎలాంటి కేసులు ఉండకూడదన్నారు. ఓట్ల లెక్కింపు బందరులోని కృష్ణా యూనివర్సిటీ ఆవరణలో జరుగుతాయని తెలిపారు. మొత్తం 14 టేబుళ్ల ద్వారా 21 రౌండ్లు లెక్కించనున్నట్లు పేర్కొన్నారు. 14 టేబుల్స్‌కు 14 మంది ఏజెంట్లు, పోస్టల్ బ్యాలెట్‌కు ఇద్దరు, కౌంటింగ్‌ను ఆన్‌లైన్‌లో చూసేందుకు ఏజెంట్ లేదా అభ్యర్థి ఉండవచ్చని తెలిపారు. ఏజెంట్లకు గుర్తింపు కార్డులు, నిర్ణయించిన తేదీలలో ఆర్వో కార్యాలయంలో జారీ చేయనున్నట్లు తెలిపారు. కౌంటింగ్‌హాల్లోకి సెల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. దీంతో పాటు పెన్ను కాగితం తీసుకురాకూడదన్నారు. ఓటింగ్ యంత్రాల్లో సాంకేతిక లోపాలు ఏర్పడితే వాటిని చివర్లో లెక్కిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుతో పాటు ఈవీఎంల ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందని తెలిపారు. 13ఎ, 13బిల గురించి 17సి నియమాలను శ్రీదేవి వివరించారు. అందరూ అపోహలకు తావు లేకుండా కౌంటింగ్ ప్రక్రియకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీలు నాగరాజు, శ్రీకాంత్, సీఐ సుభాకర్, ఏఆర్ఓ శ్రీ పల్లవి, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ జగన్‌మోహన్ రావు, సుందరం, గోపాల్ పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉపాధి పనులు



అల్లినగరంలో పంట కాలువ పనులు చేస్తున్న ఉపాధి కూలీలు



తోట్లవల్లూరులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

మండవల్లి: జాతీయ ఉపాధి హామీ పథకం పనులతో రైతులకు ఎంతో అండ లభిస్తుందని ఎంపీఏ ఎస్.నవీన్ పేర్కొన్నారు. మండలంలోని అల్లినగరంలో రూ. 1 లక్ష 20 వేలు ఉపాధి నిధులతో, 72 మంది కూలీలు పంట కాలువ అభివృద్ధి పనులు శుక్రవారం చేశారు. కాలువలను అభివృద్ధి చేయడం ద్వారా పంట పొలాలకు సాగునీరు సక్రమంగా చేరుతుందని ఎంపీఏ తెలిపారు. దీంతో రైతులకు అధిక దిగుబడులు సాధించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

చురుగ్గా ఉపాధి పనులు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో ఉపాధిహామీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామంలోని చిల్లకొంక రహదారి, ఆర్అండ్‌బీ రహదారి, అమ్మగారి చెరువు ప్రాంతంలో పంట కాలువల పూడిక తీత పనులను శుక్రవారం కూలీలు నిర్వహించారు. మొత్తం ఎనిమిది గ్రూపులకు సంబంధించి 184 మంది కూలీలు పనుల్లో పాల్గొన్నారు. పనులను ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ చింతలపూడి రమేష్ పర్యవేక్షించారు.

జూన్ 19 వరకు 144 సెక్షన్ అమలు

మండవల్లి: మండలంలో జూన్ 19వ తేదీ వరకు 144వ సెక్షన్, 30 కూడా అమల్లో ఉందని, ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ధర్నాలు నిర్వహించకూడదని ఎస్సై సీహెచ్ రామచంద్ర రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నలుగురికి మించి గుమికూడి ఉండరాదని పేర్కొన్నారు. బాణసంచా అమ్మడం, కాల్చడం నిషేధమని తెలిపారు. డీజే బాక్సులు పెట్టకూడదని పేర్కొన్నారు. ఇందుకు భిన్నంగా ఈ చర్యలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముగిసిన కల్యాణ మహోత్సవాలు



ఎలకుర్రు(పామర్రు): పామర్రు మండలం ఎలకుర్రు గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న భ్రమరాంబ సమేత చెన్న మల్లికార్జున స్వామి ఆలయ కల్యాణ మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయంలో త్రిశూలస్నానం నిర్వహించి స్వామివార్లను మంత్ర జాలాలతో అభిషేకాలు చేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో ఏకాదశ ప్రదక్షిణలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాశీనాథుని నాగేశ్వరరావు స్వయంగా స్వామివారి పల్లకీని భుజాలపై మోసి ఊరేగింపు నిర్వహించారు. తదుపరి వచ్చిన భక్తులందరికీ అన్నసమారాధన కార్యక్రమం చేశారు. వేలాది భక్తులకు స్వామి వారి అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.

శోభాయాత్ర కరపత్రాల పంపిణీ



పెడన: హనుమాన్ శోభాయాత్రను జూన్ 1న పట్టణంలో నిర్వహించనున్నట్లు అభయాంజనేయస్వామి దేవస్థానం ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ, భక్త బృందం కరపత్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామలక్ష్మి వీవర్స్ కాలనీలోని దేవస్థానం వద్ద హనుమజ్జయంతి సందర్భంగా ఉదయం 8.30గంటలకు ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం 9.30 గంటలకు గుడి వద్ద శోభాయాత్ర ప్రారంభమై పట్టణంలోని దేవాలయాలను సందర్శించి తిరిగి రామలక్ష్మీ వీవర్స్ కాలనీ వద్ద గుడికి చేరుకుంటుందని పేర్కొన్నారు.

ముగిసిన సహాయమాత ఉత్సవాలు

ముదినేపల్లి రూరల్: స్థానిక ఆర్సీఎం చర్చిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సహాయ మాత మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. చర్చి స్థాపించి 55 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. చర్చి నిర్వాహకులు మాతంగి మరియ కుమార్, రెంటాల విజయ్ ఆధ్వర్యంలో ఆరాధన, స్వస్థత ప్రార్థనలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముదినేపల్లి విచారణలోని గ్రామాలకు చెందిన అనేకమంది విశ్వాసులు పాల్గొన్నారు.

ఆ ప్రాంతానికి బ్రహ్మపురం పేరొచ్చి 90 ఏళ్లు

బ్రహ్మంగారి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు



బ్రహ్మంగారి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన మల్లికార్జునుడు, సుమలత దంపతులు

పెడన: పెడనలోని బ్రహ్మపురం ప్రాంతానికి పేరు నామకరణంతో పాటు అక్కడ బ్రహ్మంగారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి 90 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా ఆ నాటి విగ్రహస్థాపకులు బీరక మల్లికార్జునుడు వంశీయులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1934లో మే 24న శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆశీస్సులతో బీరక మల్లికార్జునుడు అప్పట్లో బ్రహ్మంగారి విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశారు. ఆ ప్రాంతానికి బ్రహ్మపురం అని నామకరణం చేశారు. అప్పటి నుంచి కూడా బ్రహ్మపురంగా పిలుస్తున్నారు. అక్కడ విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో అక్కడ ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవిస్తున్నారనేది నమ్మకం ఏర్పడిందనేది స్థానికుల విశ్వాసం. ఈ నేపథ్యంలో 90 ఏళ్ల పూర్తయిన సందర్భంగా మల్లికార్జునుడు మనవడు బీరక మల్లికార్జునుడు, సుమలత దంపతులు ప్రత్యేక పూజాది కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన ఏర్పాటుచేశారు.

ఇంటింటి సర్వేపై సమీక్ష

గూడూరు: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల గుర్తింపునకు గూడూరులోని భవిత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను జిల్లా ఐఈ సమన్వయకర్త కె.ఏడుకొండలు సమీక్షించారు. గూడూరులోని భవిత కేంద్రాన్ని శుక్రవారం ఎంఈఓ-2 పి.సుబ్రహ్మణ్యంతో కలిసి సందర్శించిన ఏడుకొండలు ఇప్పటి వరకు సర్వే పురోగతిని అడిగి తెలుసుకున్నారు. 0 నుంచి 18 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలను గుర్తించడమే కాకుడా భవిత కేంద్రంలో నమోదు చేయించాలని సమన్వయకర్త కె.ఏడుకొండలు సూచించారు. స్థానిక అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల సహకారంతో నూరుశాతం బాలబాలికలను గుర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ పి.రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.వెంకటేశ్వరమ్మ, బి.భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథుడి రథోత్సవం



వడాలిలో జగన్నాథుడి రథోత్సవం

ముదినేపల్లి రూరల్: రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయ వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత నిత్యోపాసన, బలిహరణ వంటి కార్యక్రమాలు నిర్వహించి రథోత్సవం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు, చైర్మన్ మద్రివాడ సుబ్బలక్ష్మీ ధర్మకర్తల మండలి సభ్యులు తొలుత రథాన్ని లాగి ఉత్సవాన్ని ప్రారంభించారు. రథానికి ముందు ఏర్పాటు చేసిన విచిత్ర వేషధారణలు, మంగళవాయిద్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఇంద్రజాల ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

వాహనాల తనిఖీ



వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలిస్తున్న పోలీసులు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో స్థానిక పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ ప్రక్రియ జరగాల్సి ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ పోలీసులను ఆదేశించారు. ఈ మేరకు కైకలూరు రూరల్ సీఐ బి.కృష్ణకుమార్, స్థానిక ఎస్సై డి.వెంకటకుమార్ సిబ్బంది పలు గ్రామాల్లో వాహనాలను తనిఖీ చేసి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సై మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు గ్రామాల్లో శాంతిభద్రతలు కాపాడేందుకు ఇప్పటికే ముందస్తు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేణుగోపాలస్వామికి లక్ష మల్లెల పూజ



వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి లక్ష మల్లెల పూజ శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. స్వామి వారి వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో వేదపండితుడు పంచాంగం నరసింహాచార్యుల ఆధ్వర్యంలో లక్ష మల్లెల పూజ నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి హరి దుర్గా నాగేశ్వరరావు, గుమ్మస్తా శ్రీనివాసరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



లక్ష మల్లెల పూజలో పాల్గొన్న మహిళలు